గల వికృత కాయలననే తను పండిస్తున్నానని ఆ పూజారి తన గురించి ప్రచారం చేస్తున్నాడని తెలుసుకున్న ఆ రైతు ఆవేదనగా పూజారి ఇంటికి వెళ్ళి అతన్ని నిలదీసాడు.

"ఇదన్యాయం. నేనెంత మంచి రైతునో నీకు తెలుసు. నేను పెంచిన మంచి సొరకాయలని చూసి కూడా వాటి గురించి ఎందుకలా చెడుగా మాట్లాడుతున్నావు?"

"గుడికి వచ్చే వారి విషయంలో నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం న్యాయం అయినప్పుడు, నేను నీ సొరకాయల గురించి నా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అన్యాయం ఎలా అవుతుంది?" ప్రశ్నించాడు పూజారి.

పూజారి మాటల్లోని విమర్శని గుర్తించిన ఆ రైతు వెంటనే తన తప్పుని గ్రహించాడు. ఆ తర్వాత అతను మళ్ళీ ఎన్నడూ భక్తుల విషయంలో ఎలాంటి విమర్శలు చేయలేదు.

## 72. అహంకారం

కొందరు మనుషులు ఓ అడవిలోకి వెళ్ళి తమ వివిధ అవసరాలకి సరిపడే ఆకులని ఎంపిక చేసుకుని కోసుకోసాగారు. కొన్ని చెట్ల ఆకులకి తమలో ఎవరు గొప్ప అన్న విషయం మీద అనుమానం కలిగింది. ఆ విషయం మీద అవి నేను గొప్పంటే నేను గొప్పని వాదించుకోసాగాయి. ముందుగా మామిడాకు గర్వంగా చూస్తూ చెప్పింది.

"నేను శుభస్కరం, మంగళకరం అయిన ఆకుని. మిగిలినవన్నీ అశుభ జాతికి చెందినవి."

ఆ అహంకార ఫలితంగా అది మనుషుల గుమ్మాల్లో తలకిందులుగా వేలాడసాగింది.

కూరల్లోకి కరివేపాకుని ఎంచుకున్నారు మనుషులు.

"చూసారా? సుగంధ రాశిని నేను. మీరంతా కంపు కొట్టే వాళ్ళు." గర్వంగా చెప్పింది కరివేపాకు.

ఫలితంగా అది వండాక మనుషుల కడుపుల్లోకి వెళ్ళకుండా పక్కకి తోసేయబడసాగింది.

అన్నం తినడానికి మనుషులు అరిటాకుని ఎంచుకున్నారు.

"చూసారా? మీ అందరి కన్నా నేను శుభ్రమైన ఆకుని. మీరంతా అశుభ్రమైన అంటరానివాళ్ళు." హుందాగా చూస్తూ చెప్పింది అరిటాకు.

ఫలితంగా అది అమంగళకరమైన చెత్త కుప్పల్లో దొర్లాల్సి వస్తోంది.

భోజనానంతరం తినడానికి వీలుగా తమలపాకుని ఎన్నుకున్నారు మనుషులు.

"చూసారా? నేను ఆరోగ్యాన్నిచ్చే ఆకుని. మీరంతా అనారోగ్య లక్షణాలు గల ఆకులు." అహంకారంగా చెప్పింది తమలపాకు.

ఫలితంగా అది మనిషి నోట్లోంచి కడుపులోకి వెళ్ళకుండానే ఉమ్మి వేయబడుతోంది.

ఆడవాళ్ళ చేతులని అలంకరించడానికి మనుషులు గోరింటాకుని కోసుకోసాగారు.

"చూసారా? అందాన్ని, ఆనందాన్ని ఇచ్చే ఏకైక ఆకుని నేను. మీరంతా అనాకారి ఆకులు."

ఫలితంగా అది రోట్లో బాగా రుబ్బబడి, చేతులని అలంకరించాక తీసి చెత్తకుప్పలోకి పడేయబడుతోంది.

'తాను గొప్ప ఆకు' అని నోరు విప్పి చెప్పని ఆకు ఒక్కటే.

అది తులసి ఆకు.

దాని అహంకార రాహిత్యం వల్ల అది విష్ణుమూర్తి మెళ్ళో మాలగా అలంకరింపబడుతోంది. అంతే కాదు. అది దేవతలా కూడా

పూజింపబడుతోంది. మరణ సమయంలో అది జలంతో కలిసి మనిషి నోట్లోకి వెళ్ళి అతనికి సద్గతిని కూడా కలిగిస్తోంది. అహంకార రాహిత్యంతో మనిషి అమరత్వ సిద్ధిని చేరుకోగలడని తులసి ఆకు ఋజువు చేస్తోంది.

## 73. ఎవరిని ప్రేమించాలి?

ఆత్మ సాక్షాత్కారం పరమోత్కృష్టమైనదని తెలిసిన ఒకతను ఓ పరమ గురువు దగ్గరకి శిష్యరికం కోసం వెళ్ళాడు.

"స్వామీ! దయతో నన్ను మీ శిష్యునిగా చేసుకోండి. మీ గురుత్వంతో నన్ను తరింప చేయండి." ప్రార్థించాడతను.

"నువు ఎక్కువగా ప్రేమించేది ఎవర్ని?" ప్రశ్నించాడు గురువు.

"నా కుటుంబాన్ని నేనెలా ప్రేమిస్తానో, నా బంధుమిత్రులని, వాళ్ళనెలా ప్రేమిస్తానో అలాగే నా దేశ ప్రజలని కూడా ప్రేమిస్తాను తప్ప నాకు ప్రత్యేకంగా ఎక్కువ ప్రేమించే వాళ్ళంటూ ఎవరూ లేరు స్వామీ." జవాబు చెప్పాడు అతను.

"నువ్వింకా పరిపక్వత చెందలేదు. నీకు ప్రత్యేకంగా ఎవరిమీదైనా ప్రేమ కలిగే దాకా ఆగి అప్పుడు రా." చెప్పారాయన.

అతను వెళ్ళిపోయి కొంతకాలానికి తిరిగి ఆయన దగ్గరకి వచ్చాడు.

"స్వామీ! మీరు చెప్పినట్లుగా నా ప్రేమ మారింది. నేను మీ శిష్యుడయ్యే అర్హత సంపాదించానని అనుకుంటున్నాను," చెప్పాడు.

"ఇప్పుడు నువు ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తున్నావు?" ప్రశ్నించాడు గురువు.

"మాతృ దేవో భవ, పితృ దేవో భవ అన్నారు కదా! నా తల్లితండ్రుని నేనిప్పుడు అందరికన్నా అధికంగా ప్రేమిస్తున్నాను."

"నీ ప్రేమ వారినుంచి కూడా మరలేదాకా ఆగి ఆ తర్వాత వచ్చి కనబడు." చెప్పాడు గురువు.